క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న అవుకు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: మండలంలోని జిల్లెల్ల గ్రామంలో గంగమ్మ గుడి నిర్మాణానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సోదరుడు, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి రూ.35 వేల నగదు విరాళాన్ని గ్రామస్తులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కాటసాని తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లెల్ల గ్రామంలో గ్రామ ప్రజలందరూ కలిసి గంగమ్మ గుడి నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. జిల్లెల్ల శివరామిరెడ్డి శంకర్‌రెడ్డి, కె.రామిరెడ్డి, బాలతిమ్మయ్య తదితరులు ఉన్నారు.

సమయపాలన పాటించండి



గుండ్లశింగవరం సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అవుకు: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి సూచించారు.మండల పరిధిలోని గుండ్లశింగవరం గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. కార్యాలయంలో సిబ్బంది తక్కువగా ఉండటంతో అటెండెన్స్, మూమెంట్ రిజిష్టర్లను పరిశీలించారు. గ్రామ సచివాలయంలో సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, విధులపై బయటికి వెళ్లిన వారు మూమెంట్ రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నేడు మండల సమావేశం

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాయికృష్ణ తెలిపారు. వివిధ అంశాలపై సమీక్ష జరుగుతుందన్నారు. మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు. అలాగే మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సమావేశంలో పాల్గొనాలని సూచించారు.

చెర్లోపల్లె అభివృద్ధికి కృషి



సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎరుకలి అలివేలి

అవుకు: చెర్లోపల్లె గ్రామ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నూతన సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన ఎరుకలి అలివేలి అన్నారు. గతంలో సర్పంచ్‌గా పనిచేసిన మహాలక్ష్మి సెలవు పెట్టారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం అలివేలికి చెక్‌పవర్ బాధ్యతలు అప్పగించారు. స్థానిక గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవ సమక్షంలో సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేసి ఆమె బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నాయకులు ఎరుకలి వెంకటేశ్వర్లు, వెంకటయ్య, రంగ, మధు, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

డోన్ టౌన్: మండలంలోని చిన్న మల్కాపురం గ్రామ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రియల్, టౌన్ ఫీడర్ కింద జాతీయ రహదారి పనులు జరుగుతున్నందున కరెంటు స్తంభాల మార్పులు చేస్తున్నటు ఏఈ నాగేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా శుక్రవారం చిన్నమల్కాపురం గ్రామం, ఇండస్ట్రియల్ పరిధిలో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు డోన్ విద్యార్థిని

డోన్ టౌన్: త్వరలో జరగబోయే జాతీయ స్కూల్ గేమ్స్ పోటీలకు పట్టణానికి చెందిన రామాంజనేయులు, అరుణ దంపతుల కుమార్తె సాయిదీపిక ఎంపికైంది. ఈ నెల 15వ తేదీ నుండి 17వ తేదీ వరకు నంద్యాలలో జరిగిన అండర్–17 రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో ఫెన్సింగ్ గేమ్ విభాగంలో సాయిదీపిక ఉత్తమ ప్రతిభ కనబరచి బంగారు పతకం సాధించింది. దీంతో గురువారం స్కూల్లో విజేతను అభినందించి సత్కరించారు.

కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: పట్టణంలోని సాయి కంప్యూటర్స్, హెల్ప్ స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ అందించనున్నట్లు సంస్థ నిర్వాహకుడు దస్తగిరి తెలిపారు. ప్రతి ఒక్కరికీ కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమనే ఉద్దేశంతో పేద, మధ్య తరగతి నిరుద్యోగ, యువతను దృష్టిలో ఉంచుకొని శిక్షణ ఇస్తున్నట్లు వారు తెలిపారు. ఆసక్తి గల వారు డిసెంబర్ 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు భారత్ బేకరి లైన్‌లోని సాయి కంప్యూటర్‌లో సంప్రదించాలన్నారు.

అందరి సహకారంతో యాత్ర విజయవంతం

- సీఎం పర్యటనను రెట్టింపు ఉత్సాహంతో జయప్రదం చేయాలి
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: పార్టీ శ్రేణులు, ప్రజల సహకారంతో బనగానపల్లె పట్టణంలో బుధవారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతమైనట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం కోవెలకుంట్లలో ఆయన మాట్లాడుతూ.. కనీ, విని ఎరుగని రీతిలో కోవెలకుంట్ల, సంజామల, అవుకు, బనగానపల్లె, కొలిమిగుండ్ల మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన వేలాది మంది ప్రజలు సాధికార యాత్ర బహిరంగ సభకు హాజరయ్యారన్నారు. యాత్ర విజయవంతం చేసేందుకు కృషి చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ, రాజకీయ రంగాల్లో కల్పించిన ప్రాముఖ్యతపై ఉపముఖ్యమంత్రులు అంజాద్‌బాష, నారాయణస్వామి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ మధుసూదన్ తదితరులు ప్రజలకు వివరించారన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న సాధికార యాత్ర ప్రజల్లో విశ్వాసం నెలకొల్పుతుందనేందుకు బనగానపల్లెలో నిర్వహించిన సభ ఉదాహరణ అన్నారు. బనగానపల్లె పట్టణంలో రూ. 22 కోట్లతో నిర్మించిన వంద పడకల ఆసుపత్రిని త్వరలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు. పార్టీశ్రేణులు, అభిమానులు రెట్టింపు ఉత్సాహంతో సీఎం పర్యటనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జున రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, పార్టీ నాయకులు సిద్ధంరెడ్డి రాంమోహన్ రెడ్డి, భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ



కోవెలకుంట్లలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కోవెలకుంట్ల: విజయనగర పాలకులు శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం ఆవిష్కరించారు. ఆర్టీసీ బస్టాండ్ రోడ్‌లోని అయ్యప్ప స్వామి ఆర్చీ సమీపంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీకృష్ణ దేవరాయలు తన రాజ్య పరిపాలనలో దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో వందలాది దేవాలయాలు నిర్మించారన్నారు. ఆయన వంశస్తులు కోవెలకుంట్లలో పాండురంగ స్వామి దేవాలయాన్ని నిర్మించారన్నారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసి ఎన్నో చెరువులు తవ్వించి రైతులకు అండగా నిలిచారని వివరించారు. ఆయన ఆశయాలకనుగుణంగా ప్రతి ఒక్కరూ పాటు పడాలని సూచించారు. అలాంటి మహానుభావుని విగ్రహం కోవెలకుంట్లలో ఏర్పాటు చేయడం శుభపరిణామన్నారు. మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, నాయకులు బీవీ నాగార్జునరెడ్డి, బాలమురళీకృష్ణ, పరంధామయ్య, నాగరాజు, ఈశ్వరయ్య, తిరుపాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

ప్యాపిలి: విద్యార్థులు సరైన ప్రణాళిక రూపొందించుకుని చదువుకోవాలని ఎస్‌ఐ రాజ్‌కుమార్ సూచించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం పద్మాబాయి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌ఐ మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే చిన్నప్పటి నుంచే కష్టపడి చదవాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే ప్రతి అంశాన్ని శ్రద్ధతో వినాలన్నారు. అర్థం కాకపోతే వెంటనే ఉపాధ్యాయులను అడిగి సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలంటే చక్కటి చేతి రాత అలవర్చుకోవాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కోవెలకుంట్ల: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ వెంకటరెడ్డి సూచించారు. కోవెలకుంట్ల– నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, జమ్మలమడుగు, తదితర ప్రాంతాలవైపు వెళుతున్న వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

రూ.2 కోట్లతో సెంట్రల్ లైటింగ్ సిస్టం



కొత్త బస్టాండ్ సమీపంలో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్ తదితరులు

డోన్: పట్టణ సుందీకరణలో భాగంగా పలు ప్రధాన రహదారుల మధ్యలో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను రూ.2 కోట్లతో చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. స్థానిక కొత్త బస్టాండ్ వద్ద చేపట్టిన సెట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27వ తేదీన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన వివరించారు. వైస్ చైర్మన్ జాకీర్, కౌన్సిలర్లు దినేష్‌గౌడ్, ఆర్ట్ రమణ, దినేష్‌గౌడ్, వెంకట్రాముడు, రైల్వే నాగేంద్ర, కో ఆప్షన్ సభ్యులు రఫీ, పార్టీ నంద్యాల జిల్లా బీసీ విభాగం అధక్షుడు ప్రసాద్, మున్సిపల్ డీఈ రసూల్, ఏఈ సురేష్ ఉన్నారు.

భూముల పరిశీలన



అధికారులతో చర్చిస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

కొలిమిగుండ్ల: మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ భూములను గురువారం జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. బి.ఉప్పలూరు సమీపంలో టూరిజం ఆధ్వర్యంలో అభివృద్ధి చేసేందుకు 2.26 భూమిని కేటాయించాలని గతంలోనే దరఖాస్తు చేసుకున్నారు. దీనికి సంబంధించి భూమిని పరిశీలించి వివరాలు ఆరా తీశారు. గతంలో అనంతపురం–అమరావతి ఎక్స్‌ప్రెస్ వే సర్వే చేసే సమయంలో టూరిజం అభివృద్ధి చేసేందుకు హైవే సమీపంలోని భూమి కావాలని అప్పట్లో దరఖాస్తు చేశారు. అలాగే కల్వటాల, మీర్జాపురం గ్రామాల్లో 186 ఎకరాల ప్రభుత్వ భూమి కావాలని రామ్‌కో సిమెంట్ యాజమాన్యం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. ఈ భూమిపై అభ్యంతరాలతో పాటు ఇతర సమస్యలపై ఆరాతీశారు. తహసీల్దార్ ధోనీఆల్‌ఫ్రెడ్, డీటీ నాగేశ్వరరెడ్డి, మండల సర్వేయర్ సరిత తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: ఏదైనా వస్తువు కొనుగోలు చేసే సమయంలో దాని ఉపయోగాలను వినియోగదారులు పూర్తిగా తెలుసుకోవాలని డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. స్థానిక కార్యాలయంలో వినియోగదారుల మాసోత్సవాల్లో భాగంగా గురువారం తాలూకా వినియోగదారుల రక్షణ సంఘం అధక్షుడు ఏఈ నాగరాజు ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఏదైనా వస్తువు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు. స్వచ్ఛంద సంస్థల సభ్యులు ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు. పత్తికొండ, డోన్, వెల్దుర్తి సంఘం కన్వీనర్లు ధనుంజయ గౌడ్, మస్తానయ్య, మల్లికార్జున స్వామి తదితరులు ఉన్నారు.

25 నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం'

కొలిమిగుండ్ల:మండల పరిధిలోని చింతలాయిపల్లె గ్రామ సచివాలయ పరిధిలో ఈనెల 25వ తేదీ నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి గురువారం తెలిపారు. శనివారం రాఘవరాజుపల్లె, మదనంతపురం, ఎస్.చెన్నంపల్లె గ్రామాల్లో కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఆదివారం చింతలాయిపల్లెలో కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మనందరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పాల్గొంటారని చెప్పారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన

బనగానపల్లె రూరల్: మండలంలోని పసుపల గ్రామ పంచాయతీలోని చిన్నరాజు పాలెం గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో ఇటీవలనే రూ. 20 లక్షలు డీఎంఎఫ్ నిధులతో సీసీ రోడ్డు పూర్తి చేయడం జరిగిందని, మరో రూ.5 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో డ్రైనేజీ పనులు చురుగ్గా సాగుతున్నట్లు తెలిపారు. త్వరలో డ్రైనేజీ నిర్మాణం పూర్తవగానే ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని గ్రామ సర్పంచ్ మోహన్ బాబు తెలిపారు.

సరుకులు సక్రమంగా పంపిణీ చేయండి

డోన్ టౌన్: నిత్యావసర సరుకులను ప్రజలకు సకాలంలో సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ విద్యాసాగర్ రేషన్ షాపు డీలర్లకు, వాహన డ్రైవర్లకు సూచించారు. స్థానిక షాదిఖానాలో గురువారం సాయంత్రం బియ్యం పంపిణీ, లిఫ్టింగ్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీలర్ల వారీగా పంపిణీ వివరాలు, బ్యాక్‌లాగ్ వివరాలు అడిగి తెలసుకొని పలు సూచనలు చేశారు. సివిల్ సప్లై డీటీ రబ్బాని, సిబ్బంది తదితరులు ఉన్నారు.

జగనన్నతోనే సమగ్రాభివృద్ధి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి

బేతంచెర్ల: పేదల ఆర్థికాభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమవుతుందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ కృష్ణ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎం.పేండేకల్లు గ్రామంలో ఏపీకి సీఎం జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని ఎంపీడీఓ దస్తగిరిబాబు, సర్పంచ్ ముచ్చు రామక్క, ఎంపీటీసీ మహేశ్వరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామంలో 38 సంక్షేమ పథకాల ద్వారా రూ.25.15 కోట్లు లబ్ధి చేకూరిందని వివరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. గ్రామంలో నూతనంగా విగ్రహ ప్రతిష్ట జరిగిన సుంకులమ్మ, రాములమ్మ ఆలయంలో నాయకులు ప్రత్యేక పూజలు చేశారు.వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి, నాయకులు గోపాల్ రెడ్డి, పరమేశ్వరయ్య, మురళీధర్‌రెడ్డి, గిడ్డయ్య, రామకృష్ణ, వీరారెడ్డి, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్యాపిలి: గ్రామాల అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బొర్రా మల్లికార్జునరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మాధవరం గ్రామంలో గురువారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాలు అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నాయన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు.గార్లదిన్నె,మాధవరం సర్పంచులు సీమ మనోహరమ్మ, లక్ష్మినారాయణ, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పలుకూరులో గురువారం సర్పంచ్ కొనేటి సుమలత అధ్యక్షతన ఏపీకి సీఎం జగన్ మళ్లీ ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.అనంతరం గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీతో పాటు పార్టీ జెండాను ఆవిష్కరించా రు. ఎంపీటీసీ లక్ష్మీదేవి, ఈఓ శ్రీనివాసులు, సచివాలయ కన్వీనర్ ఎం.సురేష్,పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎం.పేండేకల్లులో సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరిస్తున్న ఎంపీపీ



పలుకూరులో సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న గుండం శేషిరెడ్డి

డోన్ రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని కన్నపకుంట గ్రామ సర్పంచ్ కళ్యాణి, ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల పరిధిలోని కమలాపురం గ్రామంలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. ఈఓఆర్డీ జయరాం, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

డోన్ టౌన్: గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరం అని, భ్రూణహత్యల నివారణ కమిటీ సభ్యులు, సామాజిక కార్యకర్త మహ్మద్ రఫీ అన్నారు. పట్టణంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో గురువారం భ్రూణ హత్యలు, లింగ నిర్ధారణ పరీక్షలు, సామాజిక బాధ్యత అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో లింగ భేదం అధికమై ఆడ పిల్లల నిష్పత్తి తగ్గుతుందని ఇది సమాజానికి మంచిది కాదన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి భ్రూణ హత్యలకు పాల్పడే కేంద్రాలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బూసిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కులగణనకు సహకరించండి

బేతంచెర్ల: మండలంలో ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభమయ్యే కుల గణనకు పొదుపు మహిళలు సహకరించాలని ఈఓఆర్డీ వెంకట రంగనాయకులు, వైకేపీ ఏపీఎం శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్లకు కులగణన సర్వేపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కులగణన సర్వేను ఆయా గ్రామాల్లో వలంటీర్లు నిర్వహిస్తారన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివనాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇరు వర్గాల ఘర్షణ

సంజామల: మండల పరిధిలోని బొందలదిన్నె గ్రామంలో ఇరు వర్గాల మధ్య ఏర్పడిన ఘర్షణలో చెంచు పుల్లయ్య వర్గం, నీసు ప్రసాదు వర్గం కర్రలతో దాడి చేసుకున్నారు. ఘటనపై ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. చెంచు పుల్లయ్య భార్య జ్యోతి బుధవారం ఉదయం ఇంటి సమీపంలో కూరగాయలు కొనుగోలు చేసేందుకు వెళ్లింది. తిరిగి ఇంటికి వస్తుండగా అన్న ఇంటి ముందు కుర్చొని ఉన్న నీసు ప్రసాదు జ్యోతిని అసభ్యంగా కామెంట్ చేసినట్లు భర్త పుల్లయ్యతో చెప్పింది. దాంతో పుల్లయ్య, జ్యోతి ఇద్దరూ వెళ్లి నీసు ప్రసాదును ప్రశ్నించారు. తాను ఏమీ అనలేదని అన్న కుమారుడు చెన్నయ్యను అన్నానని బదులిచ్చాడు. దీంతో మాటకు మాటకు పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఇరు వర్గాల పరస్పరం దాడి చేసుకోవడంతో ఇరువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుప్రత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం బుధవారం రాత్రి ఇంటికి వచ్చిన వెంటనే కారం పొడి, కర్రలు, గొడ్డలితో ఇరు వర్గాలు దాడి చేసుకున్నారు. దాడిలో గాయపడిన ఇరువురిని స్థానికులు కోవెలకుంట్ల, నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. ఇరు వర్గాల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రతాప్ తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి

సంజామల: ఘర్ ఘర్ కేసీసీ అభియాన్ పథకం కింద రైతులకు రుణ సదుపాయం ఉందని సద్వినియోగం చేసుకోవాలని అస్కాబ్ అధికారిణి సౌమ్య సూచించారు. మండల పరిధిలోని అకుమల్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షుడు గౌరిగారి నాగేశ్వర్ రెడ్డి, సీఈఓ చంద్రశేఖర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

25న మంత్రిచే సచివాలయ ప్రారంభోత్సవం

బేతంచెర్ల: పట్టణంలోని 4వ గ్రామ సచివాలయాన్ని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఈనెల 25వ తేదీన ప్రారంభిస్తారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి గురువారం తెలిపారు. పట్టణ ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు.

రైల్వే ప్రైవేటీకరణ ఆపాలి

బేతంచెర్ల: కేంద్ర ప్రభుత్వం భారతీయ రైల్వేను ముక్కలుగా విభజించి కార్పొరేట్లకు అనుగుణంగా ప్రైవేటీకరణ చేయడం వల్ల సామాన్య ప్రజానీకానికి తీరని నష్టం కలుగుతుందని సీఐటీయూ జిల్లా నాయకులు ఎల్లయ్య అన్నారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో సీఐటీయూ పట్టణ నాయకులు మద్దిలేటి అధ్యక్షతన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం రైల్వే ప్రైవేటీకరణ విధానాన్ని ఆపకుంటే దేశవ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం రైల్వేస్టేషన్ మాస్టర్ మహమ్మద్ బాషాకు వినతి పత్రం ఇచ్చారు. సీఐటీయూ నాయకులు మద్దిలేటి స్వామి, రాజబాబు, బాషా, రంగనాయకులు పాల్గొన్నారు.

కొచ్చెర్వు పరిశీలన

డోన్ రూరల్: మండల పరిధిలోని కొచ్చెర్వు గ్రామం వద్ద ఉన్న చెరువును గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుడు బుగ్గన అర్జున్‌రెడ్డి పరిశీలించారు. గ్రామ రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. పంటలను పరిశీలించిరు. రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజ్‌కుమార్‌యాదవ్ వెంట ఉన్నారు.

ఆకతాయిల పట్ల కఠినంగా వ్యవహరించాలి

డోన్ టౌన్: విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే ఆకతాయిల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎస్‌యూఐ సంఘం జిల్లా నాయకులు తెలుగు విజయ్‌కుమార్, మండల నాయకులు సునీల్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌ను గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రైవేట్ మహిళా కళాశాలలు, గరల్స్ హైస్కూల్, మోడల్ హైస్కూల్ తదితర ప్రాంతాల్లో కొందరు ఆకతాయిలు విద్యార్థినుల పట్ల అసభ్యంగా వ్యవహరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసి ఆకతాయి చేష్టలను నిలువరించాలని కోరారు. విద్యార్థి సంఘం నాయకులు మధు, సురేంద్ర, జగన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలోని బేతంచర్ల రోడ్డులో ఉన్న శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానంలో గాయత్రిదేవి మహిళా మండలి, ధర్మశాస్త అయ్యప్ప స్వామి ఆలయ కమిటి ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం గురువారం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా ఉదయం ఆలయ అర్చకులు గోవిదిన్నె సుబ్బచంద్రమౌళిశర్మ మంత్రోచ్చరణతో భక్తులు సామూహిక వ్రతంలో పాల్గొని సంప్రదాయబద్ధంగా సత్యనారాయణ స్వామివ్రతం చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు గాయత్రి మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చింతలాయిపల్లెలో నిర్మాణం పూర్తయిన విలేజ్ హెల్త్ క్లినిక్



యంబాయి గ్రామంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న కార్యాలయాలు

ప్రారంభోత్సవానికి సిద్ధం

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాలు అభివృద్ధి బాట పడుతున్నాయి. ప్రభుత్వ భవనాల నిర్మాణంతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. మండల పరిధిలోని చింతలాయిపల్లెలో ఈనెల 26న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేశారు. రూ.21.50 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్, జల్‌జీవన్ మిషన్ కింద రూ.40 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు, మదనంతపురంలో రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించనున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల ద్వారా చింతలాయిపల్లె గ్రామస్తులకు రూ.9 కోట్లకు పైగానే లబ్ధి చేకూరింది. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మనందరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరుకానున్నారు.

బేతంచెర్ల: గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా మండల పరిధిలోని యంబాయి గ్రామంలో రూ.35 లక్షలతో గ్రామ సచివాలయం , రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. గ్రామంలోనే ఒకేచోట సచివాలయం, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ ఉండటంతో గ్రామస్తులకు సౌకర్యంగా మారనుంది.